బల్లాలు-బాణాలు.

శ్రీమతి ఎడవల్లి జానకిబాయిగారు

సాహెబులపేటకంతకీ ఒకటే కుళాయి. ఆ పేటలో పెద్దపెద్దభవనము లేవి లేవుగాని, మట్టిగోడల తోటి కట్టినయిళ్ళు చాలయిరుకుగా ఒకదానిమీద వొకటి కట్టివున్నాయి. ఇళ్లముందరే దొమ్మదిగా కుళ్లునీళ్ల ప్రవహాలు విషపూరితమైన వాయువులతో ప్రవహిస్తూవుంటాయి. ఆరోజు శుక్రవారం. సాయింత్రం అయిదయింది. ఆ కుళాయిచుట్టూరా యిసుక వేస్తేరాలనంతజనం మూగివున్నారు. అక్కడవున్న కుండలకి బిందెలకు లెక్కలేదు. ఆరోజుప్రొద్దున్న అధికవర్షం కురియటంచేత దుమ్ము లేగుతూ వుండే రోడ్డు, అడుగేస్తే అంటుకుపోయేటట్టు తయారయింది. కుళాయిచుట్టురా చాలాబురదగా, నీళ్లు పట్టుకోటానికి యిబ్బందిగావుంది. వచ్చినజనం దొమవరి బిందెలోవారు, ముందర నీళ్లుపట్టుకుందామని తంటాలుపడుతున్నారు. ఒకమనిషి కుళాయినొక్కి నీరు తనబిందెనింపుకుంటోంటే, చీకటిపడుతోందనే తొందరకొద్దీ, తక్కినవాళ్లవిసుగుద లెక్కువై పోతోంది.

"సురేరావుపేటలో అందరు ధనవంతులవటంచేత యింటికి మూడుకుళాయిలు చొప్పున పెట్టారు. మనపేటకంతకీ వొకటేకుళాయి" అంది ఒక యిల్లాలు.

"కుళాయిలెన్నున్నా అసలు ఆకుళాయి చెరువులో సరిపోవునీరులేందే." అంది ఇంకోకామె, కుళాయిచెరువుకేసి చూపిస్తూ.

"కావలసినంత నీరువుంది, య్యాక్రింద" అంది వేరోకామె ఆప్రక్కకుండుమీద వున్నయినుప మూతకేసి చూపిస్తూ. "దాల్లోంచే వస్తుంది మనకి నీరు. ఆనీరు మనచేత త్రాగించి ఆసుపత్రులకు రోగుల లోటు లేకుండా చేస్తుంటారు. పాపము". అందామె

ఆమె ఒక వీధుల తుడుచువాని భార్య. ఆమె చెప్పినదాల్లోకూడ కొంచం నిజంవుంది. యిల్లా వీళ్లు సంభాషించు కొంటోంటే ఫర్లాంగుదూరంలోంచి పిలుపులు వినిపించాయి.

"ఏమిటాసోది"? అని విసుగుదలతో అంది ఆ గుంపులోవున్న ఓముదుసలి.

"పీరీ-ఈ; పీరీ-ఈ-ఈ-ఈ" అని పిలుస్తోంది ఒకామె, కనుచూపుమేరలో కనిపించు యింటి గుమ్మముదగ్గ నుంచొని.

"వొస్తున్నా" అంది కుళాయిదగ్గరవున్న ఒక పన్నెండేండ్ల బాలిక. "నేనింకా నీరుపట్టలా" అంది మరల భయంతో.

"నీరుపట్టలా? అరగంటనుంచి, ఓసి సిగ్గుమాలిన దానా" అని కేకలువేసింది గుమ్మంలో నుంచున్న యిల్లాలు. "బాతాఖానీ వింటూ కూర్చున్నావు కదూ? దబ్బున దయిచెయ్యి" అంది.

పాపమా బాలిక అరగంట నేపటినుంచి నీరుపట్టు కొనుటకు వీలులేక, కుండపుచ్చుకుని నుంచునేవుంది. అక్కడ దొమవరితొందర వారిదే. అందులోనూ చిన్న పిల్ల. ఆపిలుపులు, ఆతిట్లు, ఆకేకలు వినుసరికి, అక్కడున్న జనం పిల్లమీద జాలిపడి ఆమెకుండ నింపుకొనుటకు తావిచ్చారు. పిల్ల కుండలో నీరు పట్టుకుంటున్నంతసేపు 'దబ్బున తగలడూ' అని తిడుతూనే వుంది ఆ గుమ్మంలో నుంచున్నామె. నీరు పట్టుకొని, ఆపిల్ల తొందరగా నడచి వెడుతోంది. కాని రోడ్డు బురదమయం. పిల్లకూడా చాలనీరస స్థితిలోఉంది. ఆ తొందరనడకలో కాలు జారి క్రిందపడింది. కుండ బ్రద్దలైపోయింది. ఓటికిలోలు ధ్వనిచేస్తూ, ఆధ్వనిలో పిల్లయేడుపుకూడా మిళితమైంది. పాపమాకుండ ఆమె కాలుమీదపడి కాలు గీసుకుపోయి నెత్తురొచ్చింది.

862

గుమ్మమువద్ద నుంచున్నామె బాణములా ఈమె వద్దకువచ్చి, ఏడ్చుచున్న పిల్ల జుట్టుపట్టి యింటికి యీడుస్తూ లాక్కుపోయింది.

కుళాయివద్దనున్న జనులందరికి ఆకృత్యం చాల బాధనిపించింది. వారంతా జాలిగుండెలతో 'పాపము అదృష్టహీనురాలు వీరమ్మ. అల్లాగే వుంటుంది, తల్లి చచ్చిపోయి తండ్రి మళ్లీ పెళ్లి చేసుకుంటే' అన్నారు.

౨

వెర్రిబాగుల వెంకయ్య తన బిడ్డలకు సంరక్షకు లుండరేమో నని భయంకొద్దీ మంగళసూత్రం రెండో మాటు రావమ్మ మెళ్లో కట్టాడు. సుబ్బయ్య—అతని కొడుక్కి పద్దెనిమిదేళ్లుంటాయి. వూళ్లో ఫేక్టరీలో కూలిపని చేసుకుంటున్నాడు. రోజుకు పదణాలు సంపాదిస్తాడు. అంతజీతం తెచ్చుకుంటున్న కొడుకుని చూచి చాల గర్వపడేవాడు వెంకయ్య. ఇతనికి రావమ్మయెడల సంతానము లేదు.

వెంకయ్యకు వలభయ్యోపడి వచ్చింది. అతను ఒక గుడ్డల వర్తకునివద్ద కూలికుండి బట్టలమ్ముతున్నాడు. సంసారమునందు విరక్తిపుట్టింది వెంకయ్యకు. రావమ్మతోటి కాపురం చేయలేక పోయేవాడు. సముద్రకెరటాలు ఎప్పుడూ కొండలికి తాకునట్లు, రావమ్మ వద్దనుంచివచ్చు కోపకెరటాలు వెంకయ్య కెప్పుడూ తగులుతునే యుండేవి. ఈ కెరటాల ఉష్ణతకు, వేసవియెండలకు, వెంకయ్య యెండలో పడవేసిన వల్లిలా వాడిపోయేవాడు. మనస్సునకు ఎప్పుడు శాంతియుండేదికాదు. వీటన్నిటికన్న తన బిడ్డల యెడల రావమ్మ చూపు అనాదరణ చూస్తోంటే వెంకయ్యకు హృదయభార మెక్కువై, తనమాంసమును గోళ్లతో గీస్తున్నట్లుండేది. సవతితల్లి తన కూతుర్ని తిట్టి కొడుతోంటే యేమీ చేయలేక, కళ్లు మూసుకుని "నాకళ్లు కాలిపోను. యివన్నీ చూట్టానికి నాకు కళ్లుపెట్టినట్టున్నాడు దేవుడు. కళ్ళు యీపళంగా మూసుకుపోతే బాగుండును, శక్తుండి పిల్లని రక్షించలేని నా చేతులు, కాళ్ళు విరిగి ముక్కలైపోను" అని తన్నుతానే తిట్టుకునేవాడు. ఆయ్యో! మృదు మధురమైన వాక్యాలచేత, క్రూరమైన పెద్దపులిని మచ్చిక చేయగలమా!

ప్రతిరాత్రి వెంకయ్యకు యింటికివెళ్లట మనేది ఓ గండమనిపించేది. కసాయివాని యింటికెళ్ళు మేకలా, యింటికి వెళ్లేవాడు. ఆరోజు సాయంత్రం వెంకయ్యమనస్సు మరీవిచారకరంగా ఉంది. ఆ బురదలో నడవటంవల్ల, ఆచల్లగాలికి వెంకయ్య వణుకుతున్నాడు. ఇంటికి వెళ్ళటమంటేనే వణుకు వెంకయ్యకు. ఇంటివీధిగుమ్మం ఓరవాకిలిగా తెరచియుంది. వెంకయ్య నాలుగు గజాల దూరంలో నుంచున్నాడు—అ - కాడ; నుంచుండబడి పోయాడు......రావమ్మ కోపపూరితమైన సింహగర్జనలు విని. ఒక్కొక్క గర్జనవింటోంటే వెంకయ్య పైప్రాణాలు పైనపోతున్నాయి. హృదయ వేదన యెక్కువౌతోంది. ఆగర్జించు సింహమున కాహుతియగుచున్న దెవరో వెంకయ్య పూర్తిగ యెరుగును. కాని కదలలేడు. కాళ్లాడవు. చేతు లాడవు. భయ మెక్కువౌతోంది.

"నాయింటికి నీవెక్కడ దాపరించావే. శని ముండా. ఇల్లూడవటానికేనా తీరుబడిలేకుండ పని తోటి వూపిరాడక చస్తున్నానా? నీమొగం తగలెయ్య. అంటగిన్నెలు తోమలేదు. ఇంకయేమి పనిచేసి తగలడ్డావే. నీబొందపని."............

"........."

మాట్లాడవేం. నోరుపడిపోయిందా? మొన్నమ్మవారు నిన్నేనా వేసుకపోయిందికాదే. నిన్ను కాటి కీడ్చ. ఇందాకటినుంచి నన్నుగురించి ఆకుళాయి దగ్గర యేమిచెప్పావు? చెప్పు. నోరెత్తిమాట్లాడు, లేకపోతే నోట్లోపొడుస్తా. గుడ్లెట్టి ఎల్లా చూస్తావే, గుడ్లగూబలా. నీచూపు నేలబడ"

"నేను-నిన్ను-గురిం-చి-యేమి-చెప్పలా...ఉ॥ఉ॥ ఉ॥-నేను రెండు-మాట్లు-యిల్లూడ్చా-నే నిందా-కనే-అంట్లుతో-మానమ్మ"

"ఏమిటా చెప్పలేదూ? వెళ్ళినది మొదలు నీళ్ళు పడుతూనే వున్నావు, కదూ? పోతంతకుండా పొట్ట పెట్టుకుని పైగా కరవొస్తున్నావు? నీతల బద్దల కొడతా ముండా!"

అంటూ తలపగిలేటట్లు చేతిలోవున్న చెంబుచ్చుకుని తలమీదకొట్టింది రావమ్మ, వీరమ్మని.

"నన్ను-కొ-ట్టకమ్మా, -అమ్మా-!......న-న్ను కొట్ట-కు-అది నా-తప్పుకాదు-మ్మా-కాలుజారిందమ్మా యింకా కొడుతున్నావా?-అయ్యో....నాన్నోయి! ఒరేయి.........అన్నయ్యోయి!"

"బాగా అచచ్చుముండా బాబుకోసం, అన్న కోసం అరు. గొంతుకపగిలి చచ్చేలాగరు. లంజ ముండా! చూస్తూవుండండి. మీ ముగ్గుర్ని రేపు కాట్లోకిపంపిస్తా. నీవు నన్నెదిరిస్తున్నావు కదూ! నీకు ప్రాయిశ్చిత్తం చేస్తా" అంటూ ఆమె వంటింటి లోకిపోయి ఎర్రగాకాలిన గరిటి పట్టుకొచ్చింది వాత పెట్టటానికి.

"బాబోయి—నాకు వాత పెడతావా అమ్మా— అయ్యో నాకే-వాత-వేడుకుంటా-పెట్టకమ్మా-యింక రవను-నోరు మూసుకుంటా."

వెంకయ్యకేమి చేయటానికి తోచటంలేదు. లోపల దారుణకృత్యం జరుగుతోందని తెలుసు, కాని లోపలికి పోలేదు. ఎట్టకేలకు ధైర్యమూని లోపలికిపోయి చూచాడు. చూస్తే యేముంది? అవవలసినపని కాస్తా అప్పుడే పూర్తయింది. కూతురు పరికిణీ తొడపైకి లాగి, ఆగరిటె వాత పెట్టేసిందప్పుడే. ఆబాధ కోర్వలేక, ఏడ్వటానికి శక్తిలేక నీరసంతో పడుందివీరమ్మ. ఆదృశ్యం చూచాడు నిలువునా నీరైపోయాడు. చూస్తున్నా అర్థం కావటంలేదు వెంకయ్యకు. వెంకయ్యకు తెలియకుండగనే, "పిల్లనేమిటి చేశావు" అనేమాటలు వెలువడ్డాయి.

"ఏమిచేశానా? యింక నీకు రాత్రి జోనుపడ లేనట్టుంది-తెగ పేల్తున్నావు-ఉః చాలించు నోరు" అంది గర్జిస్తూ.

పిల్లపైనా నాలుగుతలుపులు వేసి కొడుతోంటే దానికి కూడా యెదురుతిరిగి గుడ్లురిమేసరికి ధైర్యం వస్తుందిట. అంతధైర్యంవచ్చింది వెంకయ్యకు. "యిదిగో చాలిస్తా" నంటూ తలుపుచాటునున్న చేతికర్ర యెత్తాడు కొట్టటానికి.

యెత్తిన చెయ్యి యెత్తినట్టే ఉండిపోయింది. చెయ్యియెవరో వెనుకపట్టుకున్నారు.

"నాన్నా, ఆగు, తొందరకూడదు. ఇది నువ్వు చేయవలసినపని కాదు. నలుగురూ చేరుతారు పూరుకో" అన్నాడు వెనుక కర్రపట్టుకున్నతను.

"నన్నువొదిలెయ్యి వొదులు, వొదలవేం" అని చేయి లాక్కోబోయాడు తండ్రి. కాని కొడుకు వదలలా.

"అబ్బ, కుర్రాడా. నన్ను వదలరా. ఆ రాక్షసి ముండ ఆమ్మాయి నేమిచేసిందో నీకు తెలియదురా! తెలిస్తే నన్ను పట్టుకోవురా. నాకు పిచ్చెక్కుతోందిరా. వదిలెయ్యరా. దాన్ని వ్యాళే హతమార్చాలి. వొదిలెయ్యి, నన్ను వొదులు" అన్నాడు వెంకయ్య.

రావమ్మ భర్తకేసి పళ్ళుకొరుకుతూ, చెంగున వంటింట్లోకి పరుగెత్తి బద్దలయేటట్లు తలుపులు కొడుతూ మూసింది. పెనుగులాడుతున్న తండ్రి కొడుకులు నుంచున్నవారు నుంచుండిపోయారు.

సుబ్బయ్య, తనచెల్లెలువద్దకుపోయి మృదుమధుర వాక్యాలతో పూరడించి లేవతీశాడు. చెల్లెలు మాట్లాడలా. మాట్లాడలేకపోయింది. ఇంకో వాత పెట్టటానికి మళ్ళీ తల్లొచ్చిందేమోననుకొని, మాట్లాడలేక వెర్రిమాపులు చూడటం మొదలుపెట్టింది అన్నకేసి. ఆ మాపులు చూస్తుంటె అతనిగుండె నీరైపోయింది.

"అమ్మాయేడవకు" అంటూ కళ్ళనీళ్ళు తుడిచాడు. "అవులే అమ్మ చేమన్నావు. ఏమైనకష్టపెట్టావా?" అన్నాడు వాతకేసి వెర్రిమాపులు చూస్తూ.

"అన్నా-అమ్మని నేను కష్టపెట్టానట్లా అనుకున్నావు." అంది కళ్ళనీరు కారుస్తూ.

864

"అమ్మాయోయి, నీకే, నువ్వడిగావని మురుగులు చేయించుకొచ్చానమ్మా" అన్నాడు ముంగుర్లుసవరిస్తూ.

"మురుగులా—నిజంగా," అంటూ సంతోషం పట్టలేక హృదయపూర్వకంగా, తనకు క్రితంజరిగిన హృదయభారం తగ్గించుకోడానికి, తనసోదరుని గాఢాలింగనమొనర్చుకుంది.

"ఇంకా, తింటానికి మిఠాయికూడా తెచ్చా" అన్నాడు మెల్లిగా.

"మిఠాయి, మురుగులు!" అంటూ చిరునవ్వుతో ఆ పొట్లములను మనసార ముద్దిడుకుంది సంతోషంతో. ఈక్రొత్తమురుగులవల్ల గంటక్రితంజరిగిన బాధ మరిచింది.

వెంకయ్య, తనమోమును అరచేత నాన్చి తన బిడ్డల సంతోషకరములైన సంభాషణలువింటూ, మాట్లాడకుండా ఆనందిస్తూ, చూస్తూ కూర్చున్నాడు. తన హృదయభారం తగ్గింది—తన భార్యవెనుకనే తన హృదయభాగముకూడ అదృశ్యమైంది.

3

మధ్యాహ్నం పన్నెండుగంటలయింది. ఫేక్టరీలో గంటవాయించారు. గంటచప్పుడు వినటంతోనే ఫేక్టరీలో పనిచేయు పనివాండ్రందరు తండోపతండాలుగా మధ్యాహ్నభోజనాలు చేయటానికి బయిటకొచ్చి, భోజనాలకై వేయబడిన తాటాకులగుడిసెలలో భోజనాలు చేయటం మొదలుపెట్టారు.

పనివాండ్రు మొత్తం రెండువందలమంది ఆ శాలలలో కూర్చొని భోజనాలుచేస్తున్నారు. కాని ఒక కుర్రవాడుమాత్రం, భోజనము చేయక, ఏమేమో ఆలోచిస్తూ, భోజనముచేయువారికేసి ఈర్ష్యాభావ దృష్టులుసారిస్తూ కూర్చున్నాడు. ఇంతట్లో ఒక అమ్మాయి, చినిగిన గౌనొకటి తొడుగుకుని, చేతితో పొడుగు కుండనొకదానిని చిరుగులగుడ్డలో కట్టి అతి తొందరగా, ఒగర్చుకుంటూ వచ్చింది. ఆ బాలికను చూచునరికి అతని ముఖవికాసము, ఆతురతపూరితమై వికారమునకు మారింది.

"కారణమేమిటి వీరా?" అన్నాడు ఆతురతతో, "నీకళ్లు యేమంత యెర్రగనున్నాయి. ఏడ్చినట్టు కనిపిస్తున్నావు. ఇంకా—" అంటూ చేతులకేసి చూచి "నీమురుగులేవి?" అన్నాడు.

"అమ్మ బద్దలకొట్టింది" అంది దీనస్వరంతో.

"అమ్మ బద్దలకొట్టుట యేమిటి? సవిస్తరంగా చెప్పు" అన్నాడు ఆతురతతో.

"అమ్మ చెప్పిందిగదా; నాన్నడబ్బంతా తగలబెడుతున్నాట్ట. నీజీతంఅంతా యెప్పుడు ఆమె చేతులలో పెట్టటంలేదుట. నీడబ్బంతా నామురుగులకని, తినుబండారాలకని ఖర్చుపెడుతున్నావట. అంటూ నామీదకు వచ్చి, 'మింగ మెతుకులేదు, మీసాలకు సంపెంగనూనె. నీమొహానికి మురుగులుకూడానా? ఓసి భోగందానికూతురా' అంటూ రెండుచేతులు పట్టుకొని పట్టుమనివిరిచింది" అంటూ విచారముతో మాటరాక ఆగుతూ, ఆగుతూ చెప్పింది.

చెల్లెలు చెప్పినమాటలు విని చెల్లెలు హస్తములు తనచేతియందుంచుకొని చేతులను తదేకదృష్టితో పరికిస్తూ కంట తడిబెడుతూ "అయ్యో తల్లీ, నీవు భోగందాని కూతురువా?" అంటూ హోరునయేడ్చి "అయ్యో, అతినాజూకుగనుండు నీవేళ్ళు ఇంటి పనులవల్ల యెంత మొద్దెక్కినవే తల్లీ! అబ్బ, నీచేతినుండు మురుగుల నింత బలవంతముగ లాగి విరచుటకు ఆమెను చేతులెట్లాడెనే తల్లీ! ఎంత మోటతనము చేసిందే! చేయియంతయు కత్తితోటి కోసినట్టు కోసుకుపోయి నెత్తురు కాలువలుకట్టుచున్న, నీ మృదుహస్తాలను చూచిరాయైన ఆమెగుండె కరుగలేదమ్మా! నీచేతులు చూచుటకు దుస్సహముగనున్నదే తల్లీ. ఎంతకఠినహృదయ—నీకు వాతలెట్టుటకు ఆమె కొంచెమైన సందేహింపనైనలేదే. అయ్యో—గొడ్డుకు వాతలుపెట్టుటకే వెనుతీయుచుందురు. అట్టి తరి నీకోమల శరీరముమీద వాతలెట్లు పెట్టగల్గెనే! అబ్బ దుర్భరము-దుస్సహము-నేసహించలేనే తల్లీ" అంటూ కళ్ళు పటపటకొరుకుతూ చటుక్కునలేచి

నుంచున్నాడు. కాసేపట్లు నుంచొని, కళ్ళనీరు కుడుచుకొని, కొంతవరకు ఆత్మశాంతి చేసుకొని మనసారా-హృదయపూర్వకంగా,తన చెల్లెల్ని గాఢాలింగన మొనర్చుకొని ముద్దులవర్షము కురిపించాడు.

ఫేక్టరీలో గంట గణగణమంది. ఆగంట యితనికి వినపళ్ళా. పక్కన పనివాళ్ళు వెడుతూ యితన్ని వింతగా చూచారు కాని ఇతను వాళ్ళని చూడలా.

“ఇక యింకైనా దీనిని ఆమె పొట్టను పెట్టుకు తీరుతుంది. ఇప్పుడే పెట్టుతున్నా. దైవశాత్తు బతికింది కాని-కానీలే-నేనే ఆమెబుర్ర బద్దలకొట్టి నరకంలోకి పంపుతా” అంటూ ఆదగ్గరవున్న కర్రలగుట్ట లోంచి పెద్దకర్రపోకటి చేతనిడుకొని, చురచుర పిచ్చివానివలె బైటకు వెళ్ళాడు.

ఈమె అతని ప్రవర్తనకు భయభ్రాంతురాలై నుంచుండిపోయింది. అన్నను వెనక్కు పిలువబోయింది కాని మాటరాలా...పదినిమషములైంది. పక్క సందునుంచి మోటార్లురెండు ఢీకొనిన చప్పుడు. జనుల హడావిడి- విచారసూచికమైన కేకలు- మొదలయినవి వినిపించాయి. ఆకేకలు, ఆ హడావిడి బట్టిచూస్తే ఒక దారుణకృత్యం జరిగినట్టు కనిపిస్తుంది.

౪

ఆరోజు సాయంత్రం లోకల్ పేపర్సు క్రింది విధంగా ప్రకటించాయి.

కారుప్రమాదము

యువకుని ఆకస్మిక మరణము

ఈరోజు మధ్యాహ్నము పద్దెనిమిదేండ్ల యువకు డొకడు, ఐన్‌హౌస్ నకు పోవురోడ్డుపై, రెండు కార్లు ఢీకొనుటచే మరణించెను. ఆతను రాధాకృష్ణా ఫేక్టరీలో పనిచేయు సుబ్బయ్య అని గుర్తింపబడింది. ఆతనికి తల్లిదండ్రులున్నారు. అతని చేతియందు పెద్దకర్రపోకటి వున్నది.

ఒక విలేఖరి.

ఈ విషయము వెంకయ్యకు తెలిసింది. కొడుకు ఆకస్మికమరణవార్త వినగనే తండ్రి మూర్ఛపోయినాడు. వీరమ్మ పిచ్చియెత్తిన దానివలె నుంచున్నపళంగా యిల్లువదలి అదృశ్యమైంది.

వెంకయ్యకు మాటలేదు- శ్వాసలేదు- కూర్పులేదు. ఇరుగుపొరుగువారంతా వచ్చి వెంకయ్యను ఓదార్చారు. వెంకయ్యకొంతసేపటికి కళ్ళుతెరచి “అయ్యో! రాక్షసీ, నీవు నాబిడ్డల వెంటకట్టపెట్టావు. నీవుపెట్టు కష్టములను సహించలేకపోయాడే! ఇప్పుడుకదా నీకు మనశ్శాంతి కలిగింది. అయ్యో! కుర్రా, నీకింత దారుణమృత్యువుకలిగిందిరా. ఆచావు ఈరాక్షసికే పెట్టాడుకాదురా పాపిష్టిదేవుడు. నాకు నావీరమ్మనేనా కళ్ళారా చూపించండి బాబూ” అని హోరుహోరున ఏడ్వటం మొదలెట్టాడు-ప్రక్కనున్నవారు ఓదార్చారు.

“తగిలిన వేలుకే తగులుతుంది” అన్నట్లు తన అన్న మరణము విన్నతక్షణం, తనకీ ఈలోకములో యిక తావులేదనుకుని, తను యిక బ్రతుకుట దుర్లభమని, తన ప్రాణమైనవస్తువు దాటిపోయిందని విచారించి యిక విచారము పట్టలేక ఆప్రక్కన శివాలయములోనున్న కొలనులోపడి ప్రాణములు బాసింది వీరమ్మ. మర్నాడు శవము తేలగా బయటకులాగారు పురజనులు.

ఈదారుణవార్త వెంకయ్యకు తెలిసింది. నుంచున్నపళంగా పిచ్చెక్కింది వెంకయ్యకు. ఆపిచ్చిలో తనుకూడ యిల్లువదలి వీధులవెంబడి పిచ్చివానివలె వచ్చిపోవువారిమీద రాళ్ళురువ్వడము—కొట్లమీద గుడ్డలుచింపి, సరుకులు గిరవాటేసినప్పుడు—తిన్నచోట్ల తిట్లు, పడ్డచోట్ల దెబ్బలు పడుతూ యిప్పటికీ తిరుగుతూనే వున్నాడు వెంకయ్య.

ఆహో, పుత్రశోకమున ఎంతవారికైనను పిచ్చ తప్పక్కాను గదా లోకంలో!

866

రావమ్మ, రామారావుపేటవదలి వెళ్ళిపోయింది. పురజనులంతా వెల్లూరు పుట్టింటి కెళ్ళినదనుకున్నారు.

సంవత్సరము దాటింది. ఆమె జాడలేమి తెలియలేదు. ఒకరోజున ఎగ్మూరు మేజిస్ట్రేటుకోర్టుకు పోలీసులచే, చేతులకు సంకెళ్ళువేయబడి కొనిరాబడింది రావమ్మ. తీర్థప్రజల్లాగ ఆవ్యక్తిని చూడ్డానికెళ్ళారు ప్రజలు.

రావమ్మను పోలీసులు పట్టుకుందురను భయమున యిల్లువదలి మారువేషము వేసుకొని పారిపోయింది. సంవత్సరమునుంచి ఆమెకోసం వెతుకుతూనే వున్నారు పోలీసులు. ఆఖరికి ఆమెను ఒకగుడిసెలో పట్టుకు తీసుకువచ్చారు.

ఆగుడిసెలో ఆయిద్దరు పోలీసులకు ఆమెకు యుద్ధము జరిగింది. ఆయుద్ధంలో ఆమెకు చిన్నచిన్న దెబ్బలు తగిలినా, ఆయిద్దరి పోలీసులలోను వొకణ్ణి హతమార్చింది. ఈ గలభా అంతావిని యిరుగుపొరుగు వారువచ్చి రావమ్మను విరిచికట్టి ఆ రెండోపోలీసు కప్పుచెప్పారు గాని, వీరు రాకుండావుంటే ఆ రెండవపోలీసును కూడ చంపేసేదే. ఆ మేజస్ట్రేటు రావమ్మను హైకోర్టులో విచారించమని హైకి పంపాడు. హైకోర్టులో రావమ్మకు వురిశిక్ష వేశారు.

తాజమహాలు

శ్రీమతి రాజేశ్వరిగారు

ఎడబాటు ఘటిల్లిన యూ
యెడదలేవొ నేలగలసి—
పువ్వురాలుటం దెల్పు తోడిమె
పోలిక నిది నిలచెన్ !

ఈ జాబిలి రాలనుండి
షాజహాను కాబోలును
ప్రతినిశి స్రవియించు మృత
ప్రణయమూర్తి కొరకై !

ఈ సన్నిధిం గాలంబే
రొమాసరిల్లి నిల్చినదే
మో ! నాయెడదకుం దోచెడి
నే నాంటిదొ ప్రేమసుప్తి !

ఈ విశాల విశ్వంబున
కీ వియోగ శిల్పగీతి
యొకకొటిచాలుం బ్రేమగతికి
ముకురంబును జూపన్.